

అభివృద్ధే ధ్యేయం

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు.

- 8లో ▸



త్వరగా పరిష్కరించాలి

ప్రజావాణిలో నమోదైన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 30.0 /10.8

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి మంచు కురుస్తుంది. చలి తీవ్రత కొనసాగుతుంది.

న్యూస్‌రీల్

వచ్చేనెలలో యోగా శిబిరం

కామారెడ్డి అర్బన్: జిల్లాకేంద్రంలోని ప్రాబెల్స్ హైస్కూల్‌లో వచ్చేనెల 1, 2, 3 తేదీల్లో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మెగా యోగా శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్షుడు రాంరెడ్డి తెలిపారు. ఒకటో తేదీన సాందీపని డిగ్రీ కళాశాల, ఆర్కే డిగ్రీ కళాశాలల్లో భారత్ స్వాభిమాన్ ట్రస్ట్ ప్రముఖ్ డాక్టర్ పరమార్థదేవ్‌తో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. 2న ఉదయం జిల్లా యోగా భవన్‌లో యోగా సాధకుల సమ్మేళనం, మధ్యాహ్నం ఆధ్యాత్మిక సంస్థల సమ్మేళనం, 3న లింగంపేటలోని చారిత్రక నాగన్నగారి బావి సందర్శన కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. కార్యక్రమాలలో యోగా అభిమానులు పాల్గొనాలని కోరారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికల షెడ్యూల్ విడుదల



కామారెడ్డి అర్బన్: కామారెడ్డి పట్టణ ఆర్యవైశ్య సంఘం ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను ఎన్నికల కమిటీ ప్రతినిధి కైలాస్ శ్రీనివాస్‌రావు సోమవారం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వాసవి ఫంక్షన్ హాల్‌లో నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. అదే రోజు సాయంత్రం నామినేషన్ల పరిశీలన ఉంటుందన్నారు. 26న మధ్యాహ్నం 3 గంటల వరకు ఉపసంహరణకు గడువు ఉందని, అదే రోజు సాయంత్రం పోటీలో ఉన్నవారి జాబితా ప్రకటిస్తామని తెలిపారు. వచ్చేనెల 9న ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఎన్నికలు, సాయంత్రం 7 గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటాయని పేర్కొన్నారు. సమావేశంలో ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు శ్రీనివాస్, ఆనంద్, గౌరీశంకర్, యాద నాగేశ్వర్‌రావు, కృష్ణమూర్తి, గోవింద్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

లింగంపేట: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కీటక జనిత వ్యాధుల నివారణ కేంద్ర బృంద సభ్యులు సోమవారం సందర్శించారు. వైద్య సిబ్బందికి మలేరియా, డెంగీ వ్యాధులపై అవగాహన కల్పించారు. అనంతరం లింగంపేటలో పర్యటించి ప్రజలతో మాట్లాడారు. దోమలు, క్రిమి కీటకాల వల్ల వ్యాధులు ఎలా ప్రబలుతాయో వివరించారు. కీటక జనిత వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రాధిక, కేంద్ర బృందం సభ్యులు శ్రీనివాస్, హరిదత్తు, వైద్యులు హిమబిందు, శ్రీనివాస్ పాల్గొన్నారు.


ఎంఎల్‌టీ అసోసియేషన్ జిల్లా కార్యవర్గం



కామారెడ్డి టౌన్: మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్ అసోసియేషన్ జిల్లా కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా కేంద్రంలోని పట్టణ పద్మశాలి సంఘం భవనంలో ఎన్నికల ప్రక్రియ నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడిగా బొమ్మరి భూమేశ్, అధ్యక్షుడిగా కందడి సాయిరెడ్డి, కార్యదర్శిగా బల్ల సంతోష్ కుమార్, కోశాధికారిగా కుదుబుద్దీన్, ఉపాధ్యక్షులుగా కాచాపూర్ శ్రీధర్ పటేల్, వెంకట్, రాజాగౌడ్, సహాయ కార్యదర్శిగా నగేశ్, సభ్యులుగా కృష్ణహరి, బల్ల సురేశ్ కుమార్, మధుసూదన్, లక్ష్మీపతి, నరేందర్, షేక్ అమీర్ పాషా, ఆరిఫ్, మదన్‌మోహన్, భారతి, రజిత ఎన్నికయ్యారు. అనంతనం నూతన కార్యవర్గ ప్రతినిధులు ప్రమాణస్వీకారం చేశారు.

గ్రామ సభలకు వేళాయె!

- నేటి నుంచి గ్రామ/వార్డు సభలు
- నాలుగు పథకాల లబ్ధిదారుల జాబితాల ప్రదర్శన
- సభలో చర్చించాకే ఆమోదముద్ర
- దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నాలుగు పథకాల లబ్ధిదారుల ఎంపిక కోసం మంగళవారంనుంచి గ్రామసభలు నిర్వహించనున్నారు. ఆయా సభల్లో జాబితాలను ప్రదర్శించి చర్చించనున్నారు. సభ ఆమోదం తర్వాత ఈనెల 26నుంచి ఆయా సంక్షేమ పథకాలు ప్రారంభం కానున్నాయి. కాగా లబ్ధిదారుల జాబితాలో తమ పేరు ఉంటుందో లేదోనని దరఖాస్తుదారుల్లో ఉత్కంఠ నెలకొంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

రైతుభరోసా, రైతు ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల పథకాలను ఈనెల 26 నుంచి ప్రారంభించాలని నిర్ణయించిన ప్రభుత్వం.. ఇప్పటికే అర్హులను ఎంపిక చేసేందుకు బల్దియాలు, గ్రామాలలో సర్వే నిర్వహించింది. సర్వే వివరాలను క్రోడీకరించి, అర్హులకు సంబంధించిన ముసాయిదా జాబితాను రూపొందించింది. ఈ జాబితాలపై చర్చించి ఆమోదించేందుకు గ్రామ/వార్డు సభలు నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. ఈనెల 21 నుంచి 24 వరకు సభలు కొనసాగనున్నాయి. జిల్లాలో 535 గ్రామ పంచాయతీలు, మూడు మున్సిపాలిటీల పరిధిలోని 80 వార్డులలో సభలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. రోజూ 130 నుంచి 140 గ్రామసభలు, అలాగే మున్సిపాలిటీల్లో రోజుకు ఇరవై సభలు జరిగేలా షెడ్యూల్ రూపొందించారు. సర్వేల ఆధారంగా రూపొందించిన లబ్ధిదారుల జాబితాలను సభల్లో ప్రదర్శించి, అభ్యంతరాలు, ఆక్షేపణలు వస్తే చర్చించి, తుది నిర్ణయం తీసుకోనున్నారు.

రైతు భరోసా..

జిల్లాలో 5.24 లక్షల ఎకరాల భూమి ఉంది. ఇటీవల నిర్వహించిన సర్వేలో ఇందులో సాగుకు యోగ్యం కాని భూములు 7 వేల ఎకరాలు ఉన్నట్లు గుర్తించారు. అవి పోను మిగతా భూములకు రైతు భరోసా ఇవ్వాల్సి ఉంటుంది. గత ప్రభుత్వం ఎకరాకు పంటకు రూ. 5 వేల చొప్పున రైతుబంధు ఇవ్వగా.. ప్రస్తుత ప్రభుత్వం రూ. 6 వేల చొప్పున ఇవ్వనుంది.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా..

వ్యవసాయ కూలీలకు ఏడాదికి రూ. 12 వేల చొప్పున సాయం అందించేందుకు ప్రభుత్వం రైతు ఆత్మీయ భరోసా పథకానికి శ్రీకారం చుడుతోంది. దీనికి ఉపాధి హామీని ప్రామాణికంగా తీసుకుంది. గతేడాది కనీసం 20 రోజులు ఉపాధి హామీలో పనిచేసిన కుటుంబాల లెక్కలు తీసింది. జిల్లాలో 1.70 లక్షల జాబ్‌కార్డులు ఉండగా.. 60 వేల జాబ్ కార్డులపై ఇరవై రోజులపైన పని చేసినట్టు గుర్తించారు. అందులో నిబంధనల ప్రకారం భూమి లేని కూలీల వివరాలు తీసుకున్నారు. జిల్లాలో 15,501 మంది కూలీలకు రైతు ఆత్మీయ భరోసా అందనుంది.

ఇందిరమ్మ ఇళ్లు..

ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 2.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. సర్వేలో ఆ దరఖాస్తులను పరిశీలించిన అధికారులు అర్హుల జాబితాలను రూపొందించారు. ఎంత మంది అర్హులనేది ఇంకా వెల్లడించలేదు. అయితే ఒక్కో అసెంబ్లీ నియోజక వర్గంలో తొలి విడతలో 3,500 కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఇళ్ల కోసం భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చినందున లబ్ధిదారుల జాబితాలో ఎవరి పేరుంటుందోనన్న ఉత్కంఠ నెలకొంది.


ఆహార భద్రత కార్డులకోసం..

జిల్లాలో రేషన్ కార్డుల కోసం 21,842 దరఖాస్తులు రాగా.. ఇటీవల సర్వేలో వాటిని పరిశీలించారు. అందులో అర్హులను గుర్తించి కార్డులు జారీ చేయనున్నారు. అలాగే గతంలో రేషన్ కార్డులో కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం కోసం 60,472 దరఖాస్తులు వచ్చాయి. అయితే కొత్త కార్డుల కోసం వేలాది కుటుంబాలు ఎదురుచూస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం గ్రామ సభల్లో దరఖాస్తులు తీసుకుంటామని ప్రకటించింది.

అంతా అయోమయం..

నాలుగు పథకాల్లో రైతు భరోసా మినహా మిగతా వాటిపై అయోమయం నెలకొంది. మిగతా మూడు పథకాల అమలులో అనేక సమస్యలు ఎదురయ్యే అవకాశాలున్నాయని భావిస్తున్నారు. ముఖ్యంగా రైతు కూలీల కోసం ఉద్దేశించిన రైతు ఆత్మీయ భరోసా పథకం నిబంధనలతో చాలామంది నిరుత్సాహానికి గురయ్యారు. జిల్లాలో లక్షా 47 వేల మంది రైతు కూలీలు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అయితే ఉపాధి హామీ పథకంలో గతేడాది 20 రోజులకుపైగా పనిచేసిన కుటుంబాలను ప్రామాణికంగా తీసుకోవడంతో చాలా మంది అర్హత కోల్పోయారు. జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా తీసుకున్న లెక్కల ప్రకారం 15,501 కుటుంబాలకు మాత్రమే ప్రయోజనం కలగనుంది. కొందరు రైతు కూలీలు వ్యవసాయ పనులకు మాత్రమే వెళతారు. వారు ఉపాధి పనులకు వెళ్లరు. చాలామంది పట్టణాలలో కూలీలుగా పనిచేస్తున్నారు. అలాగే మున్సిపాలిటీల్లో ఉపాధి హామీ పథకం లేకపోవడంతో చాలామందికి ఈ పథకం వర్తించదు. దీంతో వారంతా నిరాశ చెందుతున్నారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 2.38 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున 12,250 ఇళ్లు మాత్రమే మంజూరవుతాయి. దీంతో మిగిలినవారు రెండో విడత కోసం ఎదురుచూడాల్సిందే.. అత్యంత నిరుపేదలకు ప్రాధాన్యత ఇస్తారా, లేక నేతలు సూచించిన వారి పేర్లే ఫైనల్ అవుతాయా అన్నదానిపై జోరుగా చర్చలు నడుస్తున్నాయి.

ఉద్యాన క్షేత్రంలో చెలరేగిన మంటలు



మాల్తుమ్మెద ఉద్యాన క్షేత్రంలో చెలరేగుతున్న మంటలు

- దగ్ధమైన పండ్ల తోటలు
- మంటలను ఆర్పిన అగ్నిమాపక సిబ్బంది



ఉద్యాన క్షేత్రంలో మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

నాగిరెడ్డిపేట: మాల్తుమ్మెదలోని ఉద్యాన క్షేత్రంలో సోమవారం రాత్రి ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. ఉద్యాన క్షేత్రంలోని పండ్ల తోటలను మంటలు చుట్టుముట్టాయి. దీనిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీంతో నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డి సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని ఎల్లారెడ్డి అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇచ్చారు. ఎల్లారెడ్డి అగ్నిమాపక కేంద్రం అధికారి కిష్టయ్య ఫైర్ ఇంజిన్‌తో వచ్చి మంటలను ఆర్పివేశారు. మంటలతో ఉద్యాన క్షేత్రంలోని ఉసిరి, జామ, మామిడి, ఆయిల్‌పాం తోటలు కాలిపోయాయి. సాయంత్రం నుంచే ఉద్యాన క్షేత్రంలో మంటలు వ్యాపించడం ప్రారంభమైందని తెలుస్తోంది. అయితే ప్రమాదం జరిగిన సమయంలో ఉద్యాన క్షేత్రంలో అధికారులెవరూ అందుబాటులో లేకపోవడం గమనార్హం. ఉద్యానక్షేత్రంలో చెలరేగిన మంటల వల్ల జరిగిన నష్టంపై మంగళవారం స్పష్టత రానుంది.



ఉద్యాన క్షేత్రాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది

రుణమాఫీ కోసం ఆందోళనకు సిద్ధం

- 11 మంది రైతులను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భిక్కనూరు : పంట రుణాలు మాఫీ కాని రైతులు ఆందోళనలకు సిద్ధమవుతున్నారు. సోమవారం జాతీయ రహదారిపై ధర్నా చేసే అవకాశాలు ఉన్నాయని తెలుసుకున్న పోలీసులు.. తెల్లవారుజామునే పలువురు రైతులను అదుపులోకి తీసుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలో పంట రుణాలు మాఫీ కాని రైతులంతా వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసుకున్నారు. ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి ఆందోళనలు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ విషయం తెలియడంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆందోళనకు నాయకత్వం వహించే అవకాశాలున్నట్లు అనుమానించి భిక్కనూరు మండలంలోని తిప్పాపూర్ గ్రామానికి చెందిన ఆరుగురిని, లక్ష్మీదేవునిపల్లి గ్రామానికి చెందిన ఐదుగురిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఉదయం 10 గంటల వరకు స్టేషన్‌లోనే ఉంచుకున్నారు. అనంతరం జాతీయ రహదారిపై ఆందోళనలు చేస్తే కేసులు నమోదవుతాయని హెచ్చరించి వదిలిపెట్టారు.

హత్య కేసులో భార్యాభర్తలకు జైలు



కామారెడ్డి టౌన్/ఎల్లారెడ్డి రూరల్: ఇంటి యజమానికి మత్తు మందు కలిపిన కల్లు తాగించి అతడి మరణానికి కారణమవడమే కాకుండా ఆ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన దంపతులకు జిల్లా న్యాయమూర్తి శిక్ష ఖరారు చేశారు. ఎస్పీ సింధు శర్మ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. 2018 సెప్టెంబర్ 24న గుంటూరు జిల్లాకు చెందిన దంపతులు గంజి దివ్య అలియాస్ లక్ష్మి, గంజి వెంకటేశం అలియాస్ గణేశ్ ఎల్లారెడ్డికి వచ్చారు. వస్త్ర వ్యాపారులుగా నమ్మించి వృద్ధ దంపతులైన కల్యాణి ఇంద్రమ్మ, శంకరయ్యల ఇంట్లో అద్దెకు దిగారు. వారం తర్వాత దివ్య, వెంకటేశం రెండు కల్లు సీసాలు తీసుకుని ఇంటికి వచ్చారు. ఒకటి ఇంటి యజమానికి ఇచ్చి మరొకటి వారు తీసుకుని వెళ్లారు. ఇంటి యజమానికి ఇచ్చిన సీసాలో అప్పటికే మత్తుమందు కలిపి ఉంచారు. ఆ కల్లు తాగిన శంకరయ్య మరణించగా.. ఇంద్రమ్మ నిద్రలోకి జారుకుంది. నిందితులు దివ్య, వెంకటేశంలు ఇదే అదనుగా భావించి, కల్యాణి ఇంద్రమ్మ మెడలోని బంగారు పుస్తెలతాడు, చెవి కమ్మలతోపాటు బీరువా పగులగొట్టి అందులోని డబ్బు తీసుకుని పారిపోయారు. మరుసటి రోజు మృతుడి భార్య ఇంద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సంఘటన స్థలంలో నిందితులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించలేదు. దీంతో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దర్యాప్తు కొనసాగించారు. నిందితులను గుంటూరు జిల్లాలో అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించారు. సాక్ష్యాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీఆర్ఆర్ వరప్రసాద్ సోమవారం తీర్పు ఇచ్చారు. వెంకటేశంకు మూడేళ్ల జైలు శిక్షతోపాటు రూ. 4 వేల జరిమానా, దివ్యకు ఏడాది జైలుతో పాటు రూ. 4 వేల జరిమానా విధించారు. కేసును చాకచక్యంగా ఛేదించిన ఎల్లారెడ్డి సీఐలు సుధాకర్, రవీంద్రనాయక్, ఎస్సైలు ఉపేందర్‌రెడ్డి, మహేశ్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, కోర్టు కానిస్టేబుల్ సాయిలును ఎస్పీ సింధుశర్మ అభినందించారు.

గ్రామసభలపై విస్తృతంగా ప్రచారం చేయాలి

- షెడ్యూల్ ప్రకారం సభలు నిర్వహించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: సంక్షేమ పథకాల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు మంగళవారంనుంచి నిర్వహించే గ్రామ, వార్డు సభలపై విస్తృతంగా ప్రచారం చేయాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఆహార భద్రత కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలపై మంగళవారంనుంచి 24వ తేదీ వరకు గ్రామ, వార్డు సభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 535 గ్రామాలు, 80 మున్సిపల్ వార్డులలో షెడ్యూల్ ప్రకారం సభలు నిర్వహించాలన్నారు. అమలు చేయనున్న పథకాలకు సంబంధించిన ముసాయిదా జాబితాలను గ్రామ, వార్డు సభల్లో వివరించి, అభ్యంతరాలు, ఆక్షేపణలు, చేర్పులపై చర్చించాలన్నారు. ప్రతి పథకానికి సంబంధించి ఒక రిజిస్టర్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. సమావేశాల్లో కొత్తగా వచ్చిన దరఖాస్తులను స్వీకరించి, తర్వాత విచారణ చేస్తామని దరఖాస్తుదారులకు తెలియజేయాలని సూచించారు. రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడం నిరంతర ప్రక్రియ అని ప్రజలకు వివరించాలన్నారు. రెవెన్యూ, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి, అంగన్‌వాడీ టీచర్లకు సహాయకులుగా విధులు అప్పగించాలని సూచించారు. గ్రామ సభల అనంతరం రైతు భరోసా, రైతు ఆత్మీయ భరోసాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాలను ప్రకటించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, ఆర్డీవో రంగనాథ్‌రావు, జెడ్పీ సీఈవో చందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డేను ఘనంగా నిర్వహించాలి

గణతంత్ర దినోత్సవాలను ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో రిపబ్లిక్ డేను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీ సీఈవో చందర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రుసుము లేకుండా బంకమట్టి..

కామారెడ్డి టౌన్: కుమ్మరి శాలివాహన కుటుంబాలు ఎలాంటి రుసుము చెల్లించకుండా చెరువుల నుంచి బంక మట్టిని పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా, మండల స్థాయి అధికారులతో ఆయన మాట్లాడారు. కాలుష్య నివారణలో భాగంగా ప్రభుత్వం మట్టి సీసాలు, కప్పుల తయారీని ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. ఇంధనానికి ఉపయోగించే మొక్కల పెంపకం కోసం ప్రభుత్వ భూమిని కేటాయించడానికి అనుమతించిందన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, శ్రీనివాస్‌రెడ్డి, బీసీ సంక్షేమ అధికారి స్రవంతి, ఆర్డీవో రంగనాథ్‌రావు, జెడ్పీ సీఈవో చందర్, అధికారులు పాల్గొన్నారు.

లక్ష్య సాధన కోసం కృషి చేయాలి

- కష్టపడితే ఏదైనా సాధించవచ్చు
- విద్యార్థులతో ఇంపాక్ట్ మోటివేటర్లు



రాష్ట్ర నార్కొటిక్స్ విభాగం ఎస్పీ సాయి చైతన్యను సన్మానిస్తున్న నిర్వాహకులు



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

కామారెడ్డి టౌన్: జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దానిని సాధించేందుకు నిరంతరం కృషి చేయాలని ఇంపాక్ట్ మోటివేటర్లు సూచించారు. ఇంటర్నేషనల్ ఇంపాక్ట్, కామారెడ్డికి చెందిన లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద సంస్థల ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని కళాభారతిలో విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు ఇంపాక్ట్ మోటివేటర్లు వజ్జ మహేందర్, నళిని, లాబిశెట్టి మహేశ్, వజ్జ నవనీత ఆయా అంశాలపై అవగాహన కల్పించారు. కష్టపడితే ఏదైనా సాధించవచ్చన్న నమ్మకాన్ని కల్పించారు. ప్రణాళికాబద్ధంగా నడుచుకోవాలని, ఓటమికి కుంగిపోకుండా దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ఏడాదంతా చదవి చివరి ఘట్టం పరీక్షల్లో ఒత్తిడికి గురైతే చదివిందంతా వృథా అవడమే కాకుండా నిరాశకు గురవుతారన్నారు. భయాన్ని వీడితేనే విజయం వరిస్తుందని పేర్కొన్నారు. చదువుతోపాటు వివిధ రంగాల్లో కూడా రాణించాలన్నారు. తెలంగాణ నార్కొటిక్స్ విభాగం ఎస్పీ సాయి చైతన్య మాట్లాడుతూ విద్యార్థులు, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ వల్ల ఎదురయ్యే పరిణామాలను వివరించారు. మత్తు, డ్రగ్స్‌కు బానిసలుగా మారి జీవితాన్ని నాశనం చేసుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, లయన్స్ క్లబ్ ఆఫ్ వివేకానంద అధ్యక్షుడు మారుతి, ప్రతినిధులు హరిధర్, భూపేష్, విజయానంద్, నవీన్, కృష్ణ హరి, విద్యార్థులు పాల్గొన్నారు.

'మాస్టర్ ప్లాన్ రద్దయ్యే వరకు పోరాటం'



టేక్రియాల్‌లో సమావేశమై చర్చిస్తున్న మాస్టర్ ప్లాన్ బాధిత రైతులు

కామారెడ్డి టౌన్: ప్రభుత్వం కామారెడ్డి మాస్టర్ ప్లాన్ రద్దు జీవోను విడుదల చేసేంతవరకు ఐక్యంగా పోరాటం చేస్తామని మాస్టర్ ప్లాన్ బాధిత రైతు ఐక్యకార్యాచరణ కమిటీ ప్రతినిధులు స్పష్టం చేశారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని టేక్రియాల్‌లో మాస్టర్ ప్లాన్ బాధిత గ్రామాల రైతులు సమావేశమయ్యారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ గత ప్రభుత్వం మాస్టర్ ప్లాన్ రద్దు చేస్తామని హామీ ఇచ్చిందని, కానీ జీవో విడుదల చేయకుండా మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుతం అదే మాస్టర్ ప్లాన్‌ను అమలు చేసే దిశగా అడుగులు పడుతున్నాయన్నారు. తమ భూముల జోలికి వస్తే ఊరుకోబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి వస్తే కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను పూర్తిగా రద్దు చేస్తామని అప్పట్లో రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో ఉద్యమం చేసి మాస్టర్ ప్లాన్ నిలిపివేయించామని, తిరిగి అదే స్ఫూర్తితో రద్దు జీవో కోసం మరోమారు ఉద్యమానికి సిద్ధమవుతామని పేర్కొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యేలు ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించి, రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సమావేశంలో టేక్రియాల్, అడ్లూర్‌ఎల్లారెడ్డి, పాతరాజంపేట, దేవునిపల్లి, రామేశ్వరపల్లి, అడ్లూర్, సరంపల్లి, లింగాపూర్ గ్రామాల రైతులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



నిజాంసాగర్(జుక్కల్): మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలె మల్లికార్జున్ బాధితులకు అందజేశారు. మల్లూర్, ఒడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామాలకు చెందిన బాధితులకు చెక్కులను పంపిణీ చేశారు.

జేసీబీ, టిప్పర్ సీజ్ చేసిన అధికారులు



నాగిరెడ్డిపేట: అనుమతులు లేకుండా మొరం తవ్వకాలకు వినియోగించిన జేసీబీ, టిప్పర్‌ను రెవెన్యూ అధికారులు సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నాగిరెడ్డిపేట మండలంలోని ఆత్మకూర్ గేట్ వద్ద అసైన్‌మెంట్ భూమిలో అనుమతులు లేకుండా గుర్తుతెలియని వ్యక్తులు జేసీబీతో అక్రమంగా మొరం తవ్వకాలు చేపట్టినట్లు తహసీల్దార్ శ్రీనివాస్‌రావు తెలిపారు. విషయం తన దృష్టికి రావడంతో జేసీబీతోపాటు టిప్పర్‌ను ఆదివారం రాత్రి పట్టుకొని సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు.

చిరుత కలకలం

మాచారెడ్డి:మాచారెడ్డి మండల సరిహద్దులో సోమవారం చిరుత కనిపించడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలంలో చిరుత దూడపై దాడి చేసింది.దీంతో గంభీరావుపేట,మాచారెడ్డి మండలాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డిరూరల్: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితుడికి రికవరీ చేసి సోమవారం అందించినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన కాపర్తి బాలకిషన్ కొద్ది రోజుల క్రితం సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేశాడు. బాధితుడు అందించిన వివరాల ఆధారంగా ఫోన్ ఆచూకీ గుర్తించి సెల్‌ఫోన్‌ను స్వాధీనం చేసుకుని బాలకిషన్‌కు అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

రిటైర్డ్ ఉపాధ్యాయుడి మృతి



భిక్కనూరు: మండలంలోని అంతంపల్లికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు గోల్కొండ నర్సింహారెడ్డి(63) సోమవారం రాత్రి మృతిచెందారు. కొంత కాలంగా ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రిటైర్ అయ్యేదాకా పనిచేశారు. అంత్యక్రియలు మంగళవారం ఆయన సొంతూరు అంతంపల్లిలో జరుగనున్నాయి.

ఐకేపీ క్యాలెండర్ల ఆవిష్కరణ



నిజాంసాగర్(జుక్కల్): గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఐకేపీ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలో క్యాలెండర్లు, డైరీలను స్థానిక ఎంపీడీవో గంగాధర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు వనిత, ఏపీఎం రాంనారాయణగౌడ్, వీవోఏల సంఘం మండల అధ్యక్షుడు భూమయ్య, కార్యదర్శి కృష్ణవేణి తదితరులున్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్
- ప్రజావాణికి 118 వినతులు



ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం: ప్రజావాణి ద్వారా దృష్టికి వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 118 ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. వచ్చిన ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. పెండింగ్ లేకుండా చూసుకోవాలన్నారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్ రావు, జెడ్పీ సీఈవో చందర్ నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణదారులపై చర్యలు తీసుకోండి

బాన్సువాడ పట్టణంలోని ఎల్లయ్య చెరువు ఆక్రమణకు గురవుతోందని పట్టణానికి చెందిన శివప్రసాద్ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎల్లారెడ్డి, దోమకొండ, తాడ్వాయిలలో ఫిర్యాదులు నిల్

ఎల్లారెడ్డి/దోమకొండ/తాడ్వాయి: తహసీల్ కార్యాలయాల్లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎలాంటి ఫిర్యాదులు రాలేవని ఎల్లారెడ్డి, దోమకొండ, తాడ్వాయి తహసీల్దార్లు మహేందర్‌కుమార్, సంజయ్ రావు, రహీమొద్దీన్‌లు సోమవారం వేర్వేరుగా తెలిపారు. గ్రామాలలో ఇంకా ఏమైనా సమస్యలున్నట్లయితే వచ్చే సోమవారం జరిగే ప్రజావాణిలో ఫిర్యాదులు చేసుకోవచ్చని సూచించారు.

పిట్లంలో ఒక ఫిర్యాదు

పిట్లం(జుక్కల్): స్థానిక తహసీల్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమం నిర్వహించినట్లు తహసీల్దార్ వేణుగోపాల్ పేర్కొన్నారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజావాణిలో ఒక ఫిర్యాదు వచ్చిందని తెలిపారు. ఎంపీడీవో కమలాకర్, మండల విద్యాధికారి దేవిసింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రేషన్ కార్డులు మంజూరు చేయాలి



జిల్లా వ్యాప్తంగా 54 తండాలలో ఉన్న లబానా లంబాడాలకు రేషన్ కార్డులు ఇవ్వాలని కోరుతూ రాష్ట్ర లబానా లంబాడా సమాజ సంఘం ప్రతినిధులు ప్రజావాణికి తరలివచ్చారు. వారు మాట్లాడుతూ.. ఎస్టీ జాబితాలో చేర్చాలనే డిమాండ్‌తో తాము గతంలో జరిగిన సమగ్ర కుల సర్వేకు దూరంగా ఉన్నామని తెలిపారు. దానిని సాకుగా చూపించి రేషన్ కార్డులు నిలిపివేయవద్దన్నారు. అనంతరం ప్రజావాణిలో వినతిపత్రం అందజేశారు.

కొత్త పాస్ పుస్తకాలు రాలేదు



తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్న భూములకు ధరణి వచ్చాక ప్రభుత్వం ఇచ్చిన డిజిటల్ పాస్ పుస్తకాలు తమకు ఇప్పటికీ రాలేదని భిక్కనూర్ మండలం తిప్పాపూర్ గ్రామ రైతులు తెలిపారు. గ్రామ శివారులోని సర్వే నెంబర్-228లో దాదాపు 30 మంది వరకు రైతులకు గతంలో ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూమి ఉందన్నారు. ఇప్పటికీ వాటిని సాగు చేసుకుంటూ జీవిస్తున్నామని తెలిపారు. విచారణ జరిపి కొత్త పాస్‌పుస్తకాలు ఇప్పించాలని ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు.

వ్యవసాయేతర భూములను పక్కాగా గుర్తించాలి

- కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు



అక్బర్ నగర్ శివారులో వ్యవసాయేతర భూముల వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

రుద్రూర్/వర్ని: వ్యవసాయ యోగ్యం కాని భూము భూములను పక్కాగా గుర్తించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు ఆదేశించారు. రుద్రూర్ మండలంలోని అక్బర్‌నగర్, రుద్రూర్, చందూర్ మండలంలో చేపడుతున్న సర్వేను సోమవారం ఆయన పరిశీలించారు. పంటలు సాగు చేయకుండా వ్యవసాయేతర అవసరాలకు భూములను వినియోగిస్తుండడం, ప్లాట్లుగా మార్చినట్లు గమనించిన కలెక్టర్ వాటి వివరాలు తెలుసుకున్నారు. గ్రామసభల నిర్వహణపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమాల్లో బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, రుద్రూర్ తహసీల్దార్ తారాబాయి, ఎంపీడీవో సురేష్ బాబు, ఏవో సాయికృష్ణ, చందూర్ ఎంపీడీవో నీలావతి, తహసీల్దార్ శాంత పాల్గొన్నారు.

23న 'గార్డ్' టీజర్ విడుదల



మాట్లాడుతున్న హీరో శీలం విరాజ్‌రెడ్డి

మోపాల్: మండలంలోని నర్సింగ్‌పల్లి శివారులో గల ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో ఈ నెల 23న సాయంత్రం 7 గంటలకు 'గార్డ్' సినిమా టీజర్ విడుదల చేస్తున్నట్లు సినీ హీరో శీలం విరాజ్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఎస్ఆర్ఎస్ గార్డెన్‌లో ఆయన మాట్లాడారు. మోపాల్ మండలం కంజర్ గ్రామంలో పుట్టి పెరిగానని, మొదటిసారిగా గార్డ్ సినిమాలో హీరోగా నటించడం ఆనందంగా ఉందన్నారు. టీజర్ విడుదల సందర్భంగా జబర్దస్త్ కామెడీ షో ఆర్టిస్టులు వస్తున్నారని, నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. లాస్య రెడ్డి యాంకర్‌గా వ్యవహరిస్తారని తెలిపారు. టీజర్‌తో పాటు పాటలు కూడా విడుదల చేస్తామన్నారు.

మద్యం మత్తులో భార్య, అత్తపై దాడి



గాయపడిన ఫర్జానా

రెంజల్: మద్యం మత్తులో భార్య, అత్తపై బ్లేడుతో దాడి చేశాడో వ్యక్తి. ఈ ఘటన రెంజల్ మండలం కందకుర్తి గ్రామంలో ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై సాయన్న తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన ఫర్జానాకు మహారాష్ట్రలోని భోకర్‌లో గల ఫారూఖ్ పటాన్‌తో వివాహం జరిగింది. మద్యానికి బానిసైన అతను భార్యను వేధించడంతో పెద్దలు సర్ది చెప్పి ఇద్దరిని కందకుర్తికి తీసుకవచ్చారు. ఇక్కడ కూలీ పనులు చేస్తు నిత్యం మద్యం తాగి భార్యను వేధించేవాడు. ఆదివారం రాత్రి తాగిన మత్తులో భార్యతో పాటు అత్త కమర్‌బేగంలపై దాడి చేశాడు. బ్లేడ్‌తో వారి గొంతుకోయడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. ఫర్జానా ఫిర్యాదు మేరకు ఫారూఖ్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

కారు, బైక్ ఢీ : ఒకరికి గాయాలు

వర్ని: మోస్రా మండలం గోవూరు శివారులో సోమవారం కారు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. మహారాష్ట్రలోని బిలోలి గ్రామానికి చెందిన గైని రవి (37)సోమవారం చందూరు నుంచి బైక్‌పై నిజామాబాద్ వెళ్తుండగా కారు ఢీకొంది. ప్రమాదంలో రవికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108లో నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

బడిబయటి పిల్లల గుర్తింపు



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండలంలోని సింగితంలో సోమవారం ఇద్దరు బడిబయటి పిల్లలను గుర్తించినట్లు సీఆర్పీలు శంకర‌గౌడ్, వెంకట్రాంగౌడ్ తెలిపారు. గ్రామానికి చెందిన మద్దెల శివకుమార్, మల్కల ప్రవీణ్ బడి మానేసి బడి బయట ఉన్నారన్నారు. వారి తల్లిదండ్రులతో మాట్లాడి బడిలో చేర్పించడం జరిగిందని సీఆర్పీలు తెలిపారు.

ఎల్లారెడ్డిలో..



ఎల్లారెడ్డిరూరల్: సోమార్‌పేట్ పాఠశాలలో ఇద్దరు బడి బయటి పిల్లలను చేర్పించినట్లు సీఆర్పీ మహిపాల్ సోమవారం తెలిపారు.నిజాంసాగర్ మండలంలోని పిప్పిర్యాగడి తండా శివారులోని బడి బయట ఉన్న ఇద్దరు పిల్లలను గుర్తించి వారికి సమీపంలోని సోమార్‌పేట్ ప్రాథమిక పాఠశాలలో చేర్పించినట్లు ఆయన తెలిపారు. హెచ్ఎం శివకుమార్, అజ్మత్ తదితరులున్నారు.

తాడ్వాయిలో..



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో సోమవారం బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో రామస్వామి ఆధ్వర్యంలో సీఆర్పీలు గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ 10 మంది బడిబయట పిల్లలను గుర్తించారు. ఎంఈవో రామస్వామి, సీఆర్పీలు నర్సింలు, రాజేందర్, రాధ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



కాస్లాబాద్‌లో గోదాం నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

- జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పెద్దకొడప్‌గల్(జుక్కల్): గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని జుక్కల్ నియోజకవర్గ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. సోమవారం వడ్లంలో సీసీ రోడ్లు, కాస్లాబాద్‌లో సీసీ రోడ్డు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం గోదాం నిర్మాణానికి సోమవారం ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాస్లాబాద్ గ్రామంలో 250 మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రూ.21 లక్షల సహకార సంఘం నిధులతో గోదాం నిర్మాణం, రూ.5 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనుల ప్రారంభం, వడ్లంలో రూ.5 లక్షలతో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణం పనులు ప్రారంభిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్ రెడ్డి, మండల మహిళా అధ్యక్షురాలు ఇందిరాబాయి, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, నాయకులు నాగిరెడ్డి, శామప్ప పటేల్, హైమద్, మల్లప్ప పటేల్ తదితరులు పాల్గొన్నారు.

బిచ్కుంద పరిధిలో..

బిచ్కుంద(జుక్కల్): మండలంలోని పెద్దదేవాడ, వాజిద్‌నగర్, గుండెనెమ్లి, బండరెంజల్ గ్రామాలలో సోమవారం ఎమ్మెల్యే సీసీ రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో సమస్యలు గుర్తించి దశల వారీగా పరిష్కరిస్తామన్నారు. నియోజకవర్గంలో కొత్తగా మూడు 108 అంబులెన్స్ ప్రారంభించామని తెలిపారు. గత పదేళ్లలో అన్ని రంగాల్లో నియోజకవర్గం వెనుకబాటుకు గురైందని, జుక్కల్ అభివృద్ధికి రూ.వందల కోట్ల నిధులు అభివృద్ధి కోసం మంజూరయ్యాయని తెలిపారు. ప్రజా సమస్యలు తెలుసుకోవడానికి జుక్కల్ క్యాంప్ ఆఫీసులో అందుబాటులో ఉంటున్నానన్నారు. నాయకులు విఠల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, గంగాధర్, గోపాల్‌రెడ్డి, రాజు పటేల్, నాగ్‌నాథ్, తుకారాం పాల్గొన్నారు.



వాజిద్‌నగర్‌లో భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే

సీపీఎం మహాసభల వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఎం నేతలు

కామారెడ్డి టౌన్: సీపీఎం తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల వాల్‌పోస్టర్లను సోమవారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఈనెల 25 నుంచి 28 వరకు సంగారెడ్డిలో 4వ మహాసభలను జయప్రదం చేయాలని పిలునిచ్చారు. ఈ సభలకు పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు బృందా కారత్, బీవీ రాఘవులు తదితరులు హాజరవుతారని తెలిపారు. ఈ మహాసభల్లో ప్రజా సమస్యలపై చర్చించి, పరిష్కారాలపై పోరాటాలు, భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. నాయకులు వెంకట్ గౌడ్, నర్సింలు, అరుణ్, ప్రకాష్ నాయక్ తదితరులున్నారు.

త్వరలోనే జిల్లాకు పోలీస్ బాస్!

- నెలాఖరులోగా నియమించే అవకాశం

ఖలీల్‌వాడి: జిల్లాకు త్వరలో పోలీస్ కమిషనర్ రానున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు కొత్త సీపీ వస్తారని పోలీస్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అక్టోబర్ 23న సీపీ కల్మేశ్వర్ కేంద్ర సర్వీసులకు బదిలీపై వెళ్లడంతో సీపీ పోస్టు ఖాళీ అయ్యింది. ఈ స్థానంలో కామారెడ్డి ఎస్పీ సింధుశర్మ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కాగా జిల్లాకు సీపీగా రావడానికి చాలా మంది ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. సీఎం విదేశాలకు వెళ్లడంతో సీపీ నియామకం ఈనెల ఆఖరు వరకు అయ్యే అవకాశం ఉందని చర్చ జరుగుతోంది. కాగా జిల్లాకు డైరెక్ట్ ఐపీఎస్‌ను తీసుకు రావడానికి సీనియర్ కాంగ్రెస్ నేత, ప్రజాప్రతినిధి ప్రయత్నం చేస్తున్నట్లు తెలిసింది. జిల్లాలో శాంతిభద్రతలను కాపాడేందుకు డైరెక్ట్ ఐపీఎస్‌తోపాటు సమర్థుడి కోసం వెతుకుతున్నట్లు సమాచారం.

మంత్రి సమీక్షలో చర్చ

నిజామాబాద్ కలెక్టరేట్‌లో ఆదివారం ఉమ్మడి జిల్లాకు చెందిన అధికారులతో ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పోస్టుపై చర్చ జరిగింది. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ సీపీ లేకపోవడంతో జిల్లాలో శాంతి భద్రతలకు విఘాతం కలుగుతుందన్నారు. దీంతో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి జోక్యం చేసుకొని సమర్థుడిని కోసం వెతుకుతున్నామని అందుకోసమే సీపీ పోస్టు ఖాళీగా ఉందన్నారు. త్వరలోనే సీపీ వస్తారని చెప్పారు.

సెలవులో వెళ్లనున్న ఇన్‌చార్జి సీపీ

ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ దీర్ఘకాలిక సెలవులో వెళ్లనున్నారు. అమెరికాలో ఎల్ఎల్ఎంకు అవకాశం రావడంతో వెళ్లనున్నట్లు తెలిసింది. అమెరికాకు వెళ్లే క్రమంలో హైదరాబాద్‌కు బదిలీ చేయించుకోవడానికి యత్నిస్తున్నట్లు సమాచారం. ఆ తర్వాతే సెలవులో వెళ్తారని తెలిసింది.

'సమాధానం చెప్పలేక ప్రభుత్వంపై నిందలు'

నిజామాబాద్ సిటీ: బాల్కొండ ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పలేక రాష్ట్ర ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర సహకార యూనియన్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డి విమర్శించారు. కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీని ఎమ్మెల్యే బహిష్కరించడంపై మానాల ప్రకటన విడుదల చేశారు. కల్యాణలక్ష్మి చెక్కులతోపాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని, ఏడాది నుంచి ప్రశాంత్ రెడ్డి ఎందుకు ప్రశ్నించలేదని నిలదీశారు. ప్రశాంత్ రెడ్డి తీరును కాంగ్రెస్ పార్టీ ఖండిస్తుందన్నారు. గతంలో ప్రశాంత్ రెడ్డి నిర్లక్ష్యంతోనే చెక్కులు ఆగిపోయాయన్నారు. ఆయన చేసిన తప్పుకు లబ్ధిదారులకు క్షమాపణ చెప్పాలన్నారు.

ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



నిజామాబాద్ అర్బన్: నగరంలోని హరిచరన్ జూనియర్ కళాశాలను జిల్లా ఇంటర్ విద్య అధికారి రవి కుమార్ సోమవారం తనిఖీ చేశారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులతో సమావేశమయ్యారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని ఆదేశించారు. ఇంటర్ ప్రయోగ పరీక్షలకు విద్యార్థులను సిద్ధం చేయడంతో పాటు వార్షిక పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. కళాశాలలో ప్రయోగశాలల నిర్వహణపై సమీక్షించారు.

పరీక్షా కేంద్రం తనిఖీ



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ న్యాయ కళాశాలలో సోమవారం ఎల్ఎల్‌బీ ఐదో సెమిస్టర్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. పరీక్షా కేంద్రాన్ని వీసీ యాదగిరిరావు తనిఖీ చేశారు. పరీక్షలను సక్రమంగా నిర్వహించాలని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఆదేశించారు. ఈ పరీక్షలకు 28 మంది విద్యార్థులకు 26 మంది హాజరైనట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు.

చెక్కుల పంపిణీ బహిష్కరణ : ఎమ్మెల్యే



వేల్పూర్: బాల్కొండ నియోజకవర్గంలో ఈ దఫా కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుకు లేఖ రాశారు. కాంగ్రెస్ అధి కారంలోకి వస్తే కల్యాణలక్ష్మి పథకంలో రూ.లక్షతో పాటు,తులం బంగారం ఇస్తామని రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారని పే ర్కొన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా తులం బంగారం ఇవ్వకపోవడంతో నిరసనగా చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శుల ద్వారా లబ్ధిదారులకు చెక్కులు అందించాలని సూచించారు.

టీచర్లకు స్పౌజ్ బదిలీలు

నిజామాబాద్‌అర్బన్: స్పౌజ్ బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. వివిధ జిల్లా ల్లో పని చేస్తున్న జిల్లాకు చెందిన 51 మంది ఎస్జీటీ టీచర్లు సొంత జిల్లాకు రానున్నారు. వీరికి బుధవారం నుంచి కౌన్సెలింగ్ నిర్వ హించనున్నారు. కొన్నేళ్లుగా వేరే జిల్లా ల్లో పనిచేస్తున్న టీచర్లు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో నిరసనలు కార్యక్రమాలు చేపట్టారు. స్కూల్ అసిస్టెంట్‌లకు గతంలోనే స్పౌజ్ బదిలీలు జరిగాయి. ఎస్జీటీ టీచర్ల స్పౌజ్ బదిలీలపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

పశువుల పాక దగ్ధం



వర్ని: చందూరు మండలం ఘన్‌పూర్ గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పశువుల పాక దగ్ధమైంది. గాలి పల్లెబోయికి చెందిన పశువుల పాకకు నిప్పంటుకోగా గమనించిన యజమాని గేదెలను ప్రమాదం నుంచి తప్పించారు. ప్రమాదంలో రూ. 50 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు వెల్లడించారు.

షార్ట్ సర్క్యూట్‌తో మీ సేవ కేంద్రం..



బాన్సువాడ: బీర్కూర్ మండలం రైతునగర్‌లో ఆదివారం రాత్రి షార్ట్ సర్క్యూట్‌తో మీ సేవ కేంద్రం దగ్ధమైంది. కేంద్రంలో రాత్రి ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. కంప్యూటర్, ప్రింటర్ తదితర వస్తువులు కాలి బుడిదయ్యాయి. గమనించిన స్థానికులు ఫైరింజన్‌కు ఫోన్ చేయడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

నిజామాబాద్ రూరల్: నగరంలోని గూపన్‌పల్లి శివారులో సోమవారం గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు రూరల్ ఎస్‌హెచ్‌వో మహ్మద్ ఆరీఫ్ తెలిపారు. గూపన్‌పల్లి శివారులో గల చెరువులో మృతదేహం గమనించిన స్థానికులు తమకు సమాచారం అందించారని చెప్పారు. హత్య చేసి పడేసినట్లు ఆయన అనుమానం వ్యక్తం చేశారు. మృతుడి వయస్సు 30 నుంచి 35 ఏళ్ల మధ్య ఉంటుందని ఆయన తెలిపారు.

డ్రంకన్ డ్రైవ్ కేసులో జైలు

బోధన్‌టౌన్: డ్రంకన్ డ్రైవ్ కేసులో ఒకరికి జడ్జి ఒక రోజు జైలు శిక్ష వేసినట్లు బోధన్ పట్టణ సీఐ వెంకటనారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన వ్యక్తిని సోమవారం బోధన్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శేషతల్ప సాయి ఎదుట హా జరు పర్చగా జైలు శిక్ష విధించారన్నారు. అలాగే పట్టణంలోని బైపాస్ రోడ్డులో బహిరంగంగా మద్యం తాగిన ఐదుగురికి కమ్యునిటీ సర్వీస్ శిక్ష వేశారని తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపొద్దన్నారు.

జేసీబీ పట్టివేత

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో అనుమ తి లేకుండా మొరం తీస్తున్న జేసీబీని ఆదివారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. అనంతరం జేసీబీని ఆర్టీసీ డి పో ప్రాంగణంలో ఉంచారు. అధికారులు ఇంకా పంచానా మా చేయలేదని తెలిసింది.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

MISSING

■ విఠల్ సుమన్ S/o. విఠల్ రాములు R/o. RTC కాలనీ, మాణిక్ బండార్, NZB నేను తేది:15-11-2024 నాడు మాదాపూర్ నుండి ఆర్టీసి కాలనీ వెళ్తుండగా F3038912 నెం॥ గల పాస్‌పోర్టు పోయినది. దొరికినచో సంప్ర: 9848644105. [SCA25001269]

■ బురుగు మధుసూదన్ గౌడ్ S/o. బురుగు చిన్న మల్లేష్ R/o. ఇ.నెం. 1-70, తొర్లికొండ, జక్రాన్‌పల్లి నుండి తొర్లికొండకు బైక్‌పై వెళ్తుండగా G4272245 & R3158575 నెంబర్ గల పాస్‌పోర్ట్‌లు పోయినవి. దొరికినచో సంప్ర: 7416261286. [SCA25001271]

■ నల్లవెల్లి సాయరెడ్డి S/o. నల్లవెల్లి నర్సయ్య R/o. H.No:1-59, డొంకల్, ఇందల్వాయి, NZB. నేను డొంకల్ నుండి ఇందల్వాయి కి బైక్ పై వెళ్తుండగా X8759071 నెం గల పాస్‌పోర్టు పోయినది. దొరికినచో సంప్ర: 9347065882. [SCA25001280]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
నిజామాబాద్
CONTACT: 9492010949

WANTED

■ Universal కంపెనీకి వర్క్ చేయుటకు స్త్రీ/పు కావలెను. జీతం : 20,000 నుండి 25,000 వరకు సంపాదించుకోండి. అడ్రస్ వాట్సాప్ చేయండి. సెల్ : 95027 12418. [M-1256043]

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను, పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం జీ: 18K.Ph: 9640468899,9640258899. [SCA25001191]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 200/-రూ॥లు
ప్రతి అదనపు లైను 50/-రూ॥లు మాత్రమే

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.